## క్లుప్తంగా

### సీఎంకు న్యూఇయర్ శుభాకాంక్షలు



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

### ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం గ్రామానికి చెందిన గుగులోతు భాగ్య హర్షిత రూ.5,116లను ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. తేలప్రోలు ప్రభాకరరావు రూ.10,116, విశాఖపట్నం జిల్లా దేవరపల్లికి చెందిన సింగంపల్లి కృష్ణమనాయుడు రూ.2.116 నిత్యాన్నదాన పథకానికి విరాళంగా అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

### సత్యసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని రైతుపేటలోగల సత్యసాయి ఆలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మందిరంలో కేక్ కట్ చేశారు. ఈ నూతన సంవత్సరం అన్నివర్గాల వారికి మంచి జరగాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### జెండా పండుగ వేడుకలు

నందిగామ: న్యూఇయర్ సందర్భంగా నందిగామలోని కార్మికులు జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. గాంధీ సెంటర్‌లో రిక్షా యూనియన్, చర్మకారులు, రామన్నపేట, చందర్లపాడు, రైతుపేట, పాత, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని పలు ముఠాలకు చెందిన కార్మికులు జెండా పండుగను జరుపుకున్నారు. ఏటా జనవరి ఒకటో తేదీన కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జెండా పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఏడాది పొడవునా అందరికీ మంచి జరగాలని కోరుతూ సంబరాలు చేసుకుంటారు. న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని ఆయా సంఘాల కార్మికులు జెండా ర్యాలీలు చేశారు.

### నేడు జగనన్న సురక్ష వైద్యశిబిరం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని వేదాద్రిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, జగ్గయ్యపేట పీహెచ్‌సీ వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తారని వివరించారు. ఈ వైద్యశిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

### నేటి నుంచి పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): వైఎస్సార్ పింఛను కానుక కింద మండలంలోని పింఛన్‌దారులకు మంగళవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. పింఛన్‌దారులకు ప్రభుత్వం ఈనెల నుంచి రూ.3వేలు అందిస్తోందని వివరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమయ్యే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను హాజరై, లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తారని వివరించారు.

### దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన గరిడి హనుమంతరావుపై దాడిచేసి చేయి విరగొట్టిన కేసులో మారిశెట్టి నరసింహారావు, గరిడి నాగరాజు అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వ్యవసాయ సోలార్ ప్యానల్స్ ధ్వంసం చేసిన సంఘటనకు సంబంధించి రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నరసింహారావును రిమాండ్‌కు తరలించగా మూడురోజుల కిందట అతను బెయిల్‌పై వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

# ఘనంగా న్యూఇయర్ వేడుకలు



పేటలో గజమాలతో విప్ సామినేని ఉదయభాను దంపతులను సత్కరిస్తున్న అభిమానులు



పోలీస్ అధికారులతో కలిసి న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్, ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



నందిగామలో న్యూఇయర్ కేక్‌కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు, పక్కన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్ : నూతన సంవత్సర వేడుకలు సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గంలో అంబరాన్నంటాయి. ప్రజలు న్యూ ఇయర్ కేక్‌లను కట్‌చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే న్యూ ఇయర్ వేడుకల కోలాహలం ప్రారంభమైంది. యువకులు ఉత్సాహంగా కేక్‌లు కట్‌చేస్తూ టపాసులు కాలుస్తూ హంగామా చేశారు. బైక్ ర్యాలీలు చేశారు. మహిళలు తమ గృహాల ముందు వివిధ రకాల రంగులతో 2024కు స్వాగతం పలుకుతూ అందంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. ఆయా ఆలయాలను భక్తులను సందర్శించి పూజలు చేశారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌లు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు.

**ప్రభుత్వ విప్ ఉదయభాను నివాసంలో...**

ఈ నూతన సంవత్సరం నియోజకవర్గ ప్రజలకు మేలు చేస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు జగ్గయ్యపేట నియోజకర్గంతోపాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులను ఆప్యాయంగా పలకరించారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఉదయభాను నివాస ప్రాంతం జనసమూహంతో అత్యంత రద్దీగా మారింది. భారీగా తరలివచ్చిన ప్రజలతో అద్దాలబజారులో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. తమ అభిమాన నాయకుడు ఉదయభానుకు శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రజలు పోటెత్తారు. విప్ సామినేని ఉదయభాను, విమలాభాను, సామినేని వెంకటకృష్ణప్రసాద్‌లకు కేకులు, పుష్పగుచ్చాలు, మొక్కలు, నోట్ పుస్తకాలు అందజేసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నాయకులు ఉదయభానును భారీ గజమాలలతో సత్కరించి, భారీ కేక్ కట్ చేయించారు. ఉదయభాను నివాసంలో జరిగిన న్యూఇయర్ వేడుకల్లో మున్సిపల్‌చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,



పొన్నవరం చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ పట్టణ, పార్టీ పట్టణ, మూడు మండలాలు, ఏటిపట్టు గ్రామాల అధ్యక్షులు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ దేవస్థానాల పాలకవర్గ చైర్మన్లు, సభ్యులు, అంగన్‌వాడీ, మెప్మా సభ్యులు, కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అంబరాన్నంటిన సంబరాలు..**

నందిగామ: నందిగామ నియోజకవర్గంలో న్యూ ఇయర్ వేడుకల సంబరాలు అంబరాన్ని తాకాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ఈ వేడుకల్లో నందిగామలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ప్రజలు న్యూ ఇయర్ కేకులు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.శుభాకాంక్షలు తెలుపుకుంటూ న్యూ ఇయర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముంగిట అందమైన ముగ్గులు తీర్చిదిద్దారు.

**ఆలయాల్లో పూజలు.. చర్చిల్లో ప్రార్థనలు..**

నూతన సంవత్సరం సందర్భంగా అన్నిచర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఆయా ప్రార్థన మందిరాల్లో నిర్వహించిన క్యాండిల్ లైట్ ఆరాధన ప్రత్యేకాకర్షణగా నిలిచింది. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలి పూజ చేశారు. సీఎస్ఐ, బేతేలు, బేతెస్థ, పరిశుద్ధ యోహాను ప్రార్థన మందిరం, హోరేబు ప్రార్థన మందిరాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. డీవీఆర్ కాలనీలోని సీయోను ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మాగల్లులోని చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ హాజరై కేక్ కట్ చేశారు. అదేవిధంగా అంబారుపేట శ్రీసత్యమ్మ అమ్మవారి ఆలయం, నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. పల్లగిరిగట్టుపై ఉన్న స్వయంభు శివలింగానికి అభిషేకాలు చేశారు.

**పెనుగంచిప్రోలు మండలంలో..**

పెనుగంచిప్రోలు: నూతన సంవత్సర వేడుకలను పెనుగంచిప్రోలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. యువకులు కేక్‌లను కట్‌చేశారు. బైక్‌లపై సందడి చేశారు. మహిళలు తమ లోగిళ్లలో ముగ్గులు వేసి నూతన సంవత్సరానికి శుభాకాంక్షలు తెలియజేశారు. బైక్‌లపై సందడి చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్ న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఆయా కూడళ్లలో ప్రజాప్రతినిధులు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

**కంచికచర్ల మండలంలో..**

కంచికచర్ల : న్యూఇయర్ వేడుకల సంబరాలు కంచికచర్ల మండలంలో అంబరాన్నంటాయి. ప్రజలు న్యూఇయర్ కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. కంచికచర్లలోని సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిలతోపాటు మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. న్యూఇయర్ సంబరాల్లో భాగంగా యువత బాణసంచా పేల్చారు. బైక్‌లపై సందడి చేశారు.

**వీరులపాడు మండలంలో...**

వీరులపాడు: నూతన సంవత్సరాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా పొన్నవరంలోని గ్రేస్ బాప్టిస్ట్, బోడవాడ జమ్మవరంల్లోని పరిశుద్ధ లూర్దుమాత దేవాలయాలు, జగన్నాథపురంలోని నిత్య సహాయమాత దేవాలయంలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దివ్య బలిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయపాల్‌రెడ్డి సొసైటీ అధ్యక్షులు జాన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.



పేటలో సుగాలీలతో కలసి డ్యాన్స్ చేస్తున్న విప్ సామినేని ఉదయభాను



పెనుగంచిప్రోలులో న్యూ ఇయర్ సందడి



ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చందర్లపాడు మండల నాయకులు



మాగల్లు చర్చిలో కేక్ కట్ చేస్తున్న కొమ్మినేని రవిశంకర్



పేటలో విప్ ఉదయభానును కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

## అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి..

**ఎమ్మెల్యే జగన్‌మోహనరావు**

నందిగామ టౌన్: గతం తడిమిన అనుభవ పాఠాలతో జాగ్రత్తపడి ముందుకు సాగితే రేపటి భవిష్యత్తులోకి భరోసాతో అడుగేయవచ్చని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన న్యూఇయర్ కేక్ కట్ చేశారు. ముందుగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ కాలమనేది కొత్త గాయాలు చేసే అస్త్రమే కాదని...పాత గాయాలు మాన్పే ఔషధం కూడా అని పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరం ప్రతిఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

**సమర్థంగా పథకాల అమలు..**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నవరత్నాల పథకాలను అమలు చేయడంతోపాటు లక్షల సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తుచేశారు.

**తరలివచ్చిన అభిమానులు..**

న్యూ ఇయర్ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్‌లకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు అధికారులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారిచే న్యూ ఇయర్ కేక్‌లు కట్‌చేయించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌లను కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో డీఎస్పీ జనార్దన్ నాయుడు, ఆర్డీవో పి.సాయిబాబు, నగరపంచాయతీ వైస్ చైర్మన్లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, వ్యవసాయాభివృద్ధి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్లు మంగునూరు కొండారెడ్డి, షహనాజ్ బేగం, పార్టీ మండల కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, నన్నపనేని నరసింహారావు, ఆవుల రమేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్లు మహ్మద్ మస్తాన్, కోటేరు మల్లేశ్వరి, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, గుడేటి నాగమల్లేశ్వరీ, కోటేరు లక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, వేల్పుల ప్రశాంతి, ముక్కపాటి నరసింహారావు, అమర్లపూడి కీర్తిసౌజన్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైస్ ఎంపీపీలు ఆకుల హనుమంతరావు, అన్నం పిచ్చయ్య, బండి మల్లికార్జునరావు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా శాఖల అధికారులు, పార్టీ నాయకులు ఉన్నారు.

# వృద్ధులకు దుస్తుల పంపిణీ

శనగపాడు(పెనుగంచిప్రోలు): నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక సెవెంత్ డే చర్చిలో నిమ్మాది శామ్యూల్, ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా చర్చి పాస్టర్ శ్యామ్ మాట్లాడుతూ ఉన్నంతలో పేదలకు సహాయం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. 12ఏళ్లుగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శామ్యూల్, ముక్తేశ్వరరావును అభినందించారు. సంఘపెద్దలు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న శామ్యూల్

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పింఛన్..**

నందిగామ: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య వృద్ధులకు సోమవారం పింఛన్ పంపిణీ చేశారు. సంఘం ఆధ్వర్యంలో పదిమంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 వందల చొప్పున పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ జనవరి నెల కూడా పదిమంది పేద వృద్ధులకు పింఛన్ పంపిణీ చేసినట్లు నిర్వాహకుడు పారేపల్లి సాయిబాబు తెలిపారు. ప్రతి నెల ఈ కార్యక్రమాన్ని దాతల సహాయంతో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

# అమర గాయకులను స్మరించుకోవాలి

విజయవాడ కల్చరల్: అమర గాయకులను నిత్యం స్మరించుకోవాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో అమర గాయకుల స్ఫూర్తి, ఆ పాత మధురాల సినీ సంగీత విభావరి గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు పాటకు అంతర్జాతీయ కీర్తిని తెచ్చినవారు ఘంటసాల, బాలసుబ్రహ్మమణ్యం అని గుర్తు చేశారు. గాయనీ గాయకులు ఆ పాత మధుర గీతాలను ఆలపించారు. అనంతరం గాయనీ గాయకులను నిర్వాహకులు సత్కరించారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి, ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, డాక్టర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



# ఇంటింటికీ అక్షింతలు

దాములూరు(ఇబ్రహీంపట్నం): అయోధ్య రామ మందిరంలో రాముల వారి పాదాల చెంత పూజలు అందుకున్న అక్షింతలు గ్రామ వికాస్ ఆధ్వర్యంలో మండలంలోని దాములూరులో సోమవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. రాముల వారి దేవాలయం నుంచి వచ్చిన అక్షింతలు స్వామి వారి ప్రసాదంగా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు గ్రామ వికాస్ సభ్యులు తెలిపారు. భజన సమాజం సభ్యులు సైకం సైదులు, సీహెచ్.గోపాలరావు పాల్గొన్నారు.

**కోటిపల్లిలో..**

కోటిపల్లి (విస్సన్నపేట): అయోధ్య రామస్పర్శ అక్షింతలకు మండలంలోని పుట్రేల పంచాయతీ కోటిపల్లి గ్రామంలోని ఆలయం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేసేందుకు భక్తులు సిద్ధం చేశారు.



దాములూరులో అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామ వికాస్ సభ్యులు, మహిళలు

### సుబ్రహ్మణేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరు అంజనాద్రికొండ పైన వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామడుగు విక్రమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

చిట్టేల(తిరువూరురూరల్): మండలంలోని చిట్టేలలో వికసిత భారత్ ప్రచార కార్యక్రమం సోమవారం జరిగింది. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు గురించి బీజేపీ జిల్లా కార్యదర్శి పోలే శాంతి గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో కొత్తగా మంజూరైన ఆయుష్మాన్ భారత్ కార్డులను, ఉజ్వల గ్యాస్ కనెక్షను పంపిణీ చేశారు. ఈఓపీఆర్‌డీ వెంకటరత్నం, సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వికసిత భారత్ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

# ఊపందుకున్న వరినాట్లు

- రబీలో 5600 ఎకరాల్లో వరిసాగు
- పొలాలకు పుష్కలంగా సాగునీరు
- ముమ్మరంగా సాగుతున్న నాట్లు
- కూలీలకు పెరిగిన డిమాండ్



వరినారు తీత పనుల్లో కూలీలు

పెనుగంచిప్రోలు: రబీ సీజన్ ముమ్మరంగా సాగుతోంది. వాతావరణం అనుకూలించడంతోపాటు సాగునీరు పుష్కలంగా లభిస్తుండటంతో పెనుగంచిప్రోలు మండలంలో వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బోరులు, బావుల కింద ఇప్పటికే రైతులు నాట్లు వేస్తున్నారు. అలాగే చెరువులు, మునేరు, పాలేరుకు కూడా నీరు వస్తుండటంతో రైతులు వేగంగా నాట్లు వేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారుగా 5600 ఎకరాల్లో రబీ వరిసాగు చేస్తున్నారు. ఓ వైపు వరినాట్లు, మరోవైపు మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతుండటంతో కూలీలకు కూడా డిమాండ్ బాగా పెరిగింది. దీంతో వరినాట్ల కోసం రైతులు, ఇతర ప్రాంతాల నుంచి కూడా కూలీలను తీసుకువస్తున్నారు. ఎకరా వరినాటుకు కూలి ధర గతంలో రూ.2వేల నుంచి రూ.2,400 ఉండగా, కూలీలకు ఏర్పడిన డిమాండ్ కారణంగా ప్రస్తుతం ఎకరాకి రూ.2,700 నుంచి రూ. 3వేల వరకు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఈఏడాది ఖరీఫ్‌లో తుపాను ప్రభావంతో కొంత మేర నష్టం వాటిల్లినా కొన్ని గ్రామాల్లో దిగుబడులు బాగా వచ్చాయి. రబీలో సైతం అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.

**రైతు భరోసాతో రైతుల్లో ఆనందం..**

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వం రైతులకు అందించిన రైతుభరోసా సాయంతో పెట్టుబడులకు పెద్దగా ఇబ్బంది లేకపోవడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించటంతోపాటు కావాల్సిన విజ్ఞానాన్ని అందిస్తుండటంతో వ్యవసాయం పండుగలా మారిందని రైతులు చెబుతున్నారు.

**సూచనలు పాటించాలి..**



ఆయా పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలి. విత్తనశుద్ధితో రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. వరిసాగులో మోతాదుకు మించి కూడా ఎరువులు వాడరాదు. రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రామసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి

### ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు సత్కారం



చిల్లకల్లులో ఆరోగ్య సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

జగ్గయ్యపేట: మండలంలోని అన్నవరం, చిల్లకల్లు గ్రామాల్లో సోమవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం చిల్లకల్లులోని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలను అధికారులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ బాబు, ఈవోపీఆర్డీ సాంబశివరావు కార్యదర్శులు నరసింహారావు, శివాజీ, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.